# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

telugprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

శనివారం 5-8-2023


# ఇట్లు.. మీ కేటీఆర్..!



చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహిద్దాం..

ఏడున నేతన్నల కోసం పలు కార్యక్రమాలు

ఇదితో ఇప్పటి వరకూ చేసిన కృషి

మంత్రి లేఖ యథాతథంగా.

**హైదరాబాద్, ఆగస్ట్5 (తెలుగుప్రభ)**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన కార్యక్రమాలతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. గౌరవ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు గారి ఆలోచనల మేరకు అన్ని వర్గాల సర్వతోముఖాభివృద్ధి కోసం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించుకున్నాం. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టింది.

### రూ. 1200 కోట్ల చొప్పున..

చేనేత, జౌళి రంగానికి చరిత్రలో ఎప్పుడు లేనివిధంగా ఏ ప్రభుత్వము కేటాయించని విధంగా 2016-2017 నుండి ప్రతి సంవత్సరం ప్రత్యేక బడ్జెట్ రూ. 1200 కోట్ల చొప్పున కేటాయిస్తు వస్తున్నాం. అప్పుల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్యల పాలవుతున్న చేనేత కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారికి రుణమాఫీ పథకాన్ని అమలు చేసింది. 2010 నుంచి ఉన్న లక్ష రూపాయల రుణాలను మాఫీ చేయడంతో 10,148 చేనేత కార్మికులు రూ.28.97 కోట్ల ఋణాల నుండి విముక్తి అయ్యారు.

### 90 కోట్ల సబ్సిడీని నేరుగా వారి ఖాతాలలోనే

రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేనేత వృత్తిపై ఆధారపడిన నేతన్నలను గుర్తిస్తూ, వారి మగ్గాలను జియో ట్యాగ్ చేయడం జరిగింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా చేనేత మిత్ర పథకం ద్వారా దాదాపు 50% రాయితీని వస్త్రాలు, రసాయనాల కొనుగోలు పైన అందిస్తున్నాం. చేనేత మిత్ర పథకం ద్వారా ఇప్పటివరకు 22 వేల మంది నేతన్నలకు సూమరు 90 కోట్ల సబ్సిడీని నేరుగా వారి ఖాతాలలోనే అందుకున్నారు.

### నేతన్నకు భీమా

నేతన్నకు చేయూత కార్యక్రమంలో భాగంగా చేనేత కార్మికుడు పొదుపు చేసే 8 శాతానికి రెట్టింపుగా 16శాతం, పవర్ లూమ్ కార్మికులు పొదుపు చేసుకునే 8 శాతానికి అదనంగా మరో 8 శాతం మెత్తాన్ని ప్రభుత్వం తన వాటాగా వారి ఖాతాల్లో జమ చేస్తుంది. దాదాపు 100 కోట్ల రూపాయల ప్రయోజనాన్ని, రాష్ట్రంలోని 21 వేల నేతన్నలు అందుకున్నారు. నేత కార్మికుల కోరిక మేరకు ఈ పథకమును రూ.90.00 కోట్ల బడ్జెట్ ప్లాన్ తో తిరిగి ప్రారంభించాము. ఇప్పటివరకు ఈ పథకంలో 32,328 మంది చేనేత కార్మికులు చేరారు. రాష్ట్రంలోని రైతన్నలకు అందుతున్న రైతు బీమా మాదిరే నేతన్నకు ప్రత్యేకంగా 5లక్షల రూపాయాల నేతన్నకు భీమా పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది.

### పావలా వడ్డీ పథకం

నేతన్నలను పావలా వడ్డీ పథకం, మగ్గముల ఆధునీకరణ పథకము చేపట్టడంతోపాటు చేనేత వస్త్ర ప్రదర్శనలు, చేనేత రంగములో శిక్షణ మరియు మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా గద్వాలలో హ్యాండ్లూం పార్కు ఏర్పాటు చేయడం వంటి అనేక కార్యక్రమాలను చేపట్టాము. దేశంలో ఏ రాష్ట్రములో లేనివిధంగా చేనేత అభివృద్ధి, సంక్షేమము కొరకు తెలంగాణలో అమలవుతున్న వినూత్న పథకాల పట్ల పలు రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఒడిశా, కర్ణాటక , మధ్యప్రదేశ్, తమిళనాడు నుండి అధికారుల బృందాలు మన రాష్ట్రములో పర్యటించి, మన చేనేత పథకాలను అధ్యయనం చేసి ప్రశంసించాయి.

### ఈ సంవత్సరం కూడా..

ప్రతి ఏడాది జాతీయ చేనేత దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుంది. ఈ సంవత్సరం కూడా రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో చేనేత వారోత్సవాలు జరగనున్నాయి. దీంతోపాటు 7 తేదీ నుంచి 14వ తేదీ వరకు పీపుల్స్ ప్లాజాలో చేనేత వస్త్ర ఉత్పత్తుల ప్రదర్శన కొనసాగుతుంది. సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో 7500 మంది నేతన్నలతో రాష్ట్రస్థాయి చేనేతల సంబరాలను నిర్వహించనున్నాం. కేవలం సంబరాలే కాకుండా ఈ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని అనేక నేతన్న సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రకటించబోతున్నది. చేనేత మిత్ర కార్యక్రమాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేతన్నలకు సమగ్ర ఆరోగ్య బీమా కార్యక్రమాన్ని చేపట్టనున్నాం. దీనికి అదనంగా నేతన్నకు బీమా కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా కొనసాగించబోతున్నాం. ప్రస్తుతం ఉన్న పిట్ లూమ్స్ ను ఫ్రేమ్ లూమ్స్ గా అప్ గ్రేడ్ చేసేందుకు తెలంగాణ చేనేత మగ్గం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించుకోబోతున్నాం. హైదరాబాద్ లోని శిల్పారామంలో చేనేత హ్యాండీక్రాఫ్ట్ మ్యూజియం, ఉప్పల్ బగాయత్ లో కన్వెన్షన్ సెంటర్ కు శంకుస్థాపన చేయనున్నాం.

ఇందులో భాగంగా మీ పరిధిలో ఉన్న నేతన్నలతో జాతీయ చేనేత దినోత్సవ సంబురాల్లో కలిసి పాల్గొని, వారితో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని కోరుకుంటూ..

మీ

కె. తారక రామారావు

## తెలంగాణలో ఆర్టీసీ విలీనం

# గవర్నర్ అభ్యంతరాలేంటి? ప్రభుత్వం ఏం చెబుతోంది..



**హైదరాబాద్, ఆగస్ట్5 (తెలుగుప్రభ)**

తెలంగాణలోని ఆర్టీసీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీంతో కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బిల్లు రూపొందించింది. ప్రస్తుతం కొనసాగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆర్టీసీ విలీనం బిల్లు పాస్ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కానీ ఆర్టీసీ విలీనం బిల్లుకు రాజ్‌భవన్ మోకాలడ్డుతోంది. సాంకేతికంగా మనీ బిల్లు కావడంతో గవర్నర్ కాన్సెంట్ కోసం రాష్ట్ర సర్కార్ పంపింది. అయితే బిల్లుపై గవర్నర్ పలు అభ్యంతరాలను వెలిబుచ్చారు. బిల్లు ఆమోదానికి తనకు కొంత సమయం కావాలని చెప్పారు. దీంతో సభలో ఆర్టీసీ బిల్లును ప్రవేశపెట్టడానికి అడ్డంకిగామారింది.

ఈ నేపథ్యంలో గవర్నర్ వ్యవహారశైలికి నిరసనగా ఆర్టీసీ కార్మికులు జంగ్‌సైరన్ పూరించారు. శనివారం ఉదయం 2 గంటలపాటు బస్సులను నిలిపివేశారు. డిపోల ముందు ధర్నా నిర్వహించారు. గవర్నర్ బంగ్లాను ముట్టడించిన ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది.. రాజ్‌భవన్ ముందు బైఠాయించారు. దీంతో రాజ్‌భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో గవర్నర్ లేవనెత్తిన అభ్యంతరాలకు ప్రభుత్వం వివరణ ఇచ్చింది.



### విలీనంపై గవర్నర్ ప్రశ్నలు

- 1958 నుంచి ఆర్టీసీలో కేంద్ర గ్రాంట్లు, వాటాలు, రుణాలు, ఇతర సహాయం గురించి బిల్లులో ఎలాంటి వివరాలూ లేవు.
- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణిస్తామని చెబుతున్న ప్రభుత్వం... వారి సమస్యలకు ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ చట్టం, కార్మిక చట్టాలు వర్తిస్తాయా..? వారి ప్రయోజనాలు ఎలా కాపాడబడతాయి.
- ఆర్టీసీ ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ ఇస్తారా..?
- ప్రభుత్వ ఉద్యోగుల్లో కండక్టర్, కంట్రోలర్ లాంటి తదితర పోస్టులు లేనందున వారి ప్రమోషన్లు, వారి క్యాడర్ నార్మలైజేషన్ లాంటి విషయాల్లో ఆర్టీసీ ఉద్యోగులకు న్యాయం ఎలా?
- ఆర్టీసీ కార్మికుల భద్రత, భవిష్యత్ ప్రయోజనాలపై ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నారు.



### ప్రభుత్వ వివరణ

- ఆర్టీసీ కార్మికులకు కార్పొరేషన్ కంటే మెరుగైన జీతాలు ఉంటాయి.
- విలీనమైన తర్వాత రూపొందించే గైడ్‌లైన్స్‌లో అన్ని అంశాలు ఉంటాయి.
- కేంద్ర ప్రభుత్వ వాటా, 9వ షెడ్యూల్ సమస్యలను ఆంధ్రప్రదేశ్ తీరుగానే పరిష్కరిస్తాం.

## జమ్మూ కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

# ముగ్గురు జవానులు వీరమరణం

**శ్రీనగర్, ఆగస్ట్5 (తెలుగుప్రభ)**



జమ్ము కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు జవాన్లు వీరమరణం పొందారు. కుల్గాంలోని హలాన్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో భద్రతా బలగాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. గాలింపు కాస్తా ఎన్‌కౌంటర్‌గా మారిపోవడంతో ఉగ్రవాదుల కాల్పుల్లో ముగ్గురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో హుటాహుటిన వారిని హాస్పటల్ కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ వారు మరణించారని శ్రీనగర్ కేంద్రంగా పనిచేస్తున్న చినార్ కారప్స్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించింది. అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అదనపు సైనిక బలగాలతో ఉగ్రవాదుల కోసం గాలింపు కొనసాగుతున్నదని అధికారులు వెల్లడించారు.

## ఆలయ గోడకు కన్నం..

# అమ్మవారి నగలు చోరీ




**మల్కాజిగిరి, ఆగస్ట్5 (తెలుగుప్రభ)**

హైదరాబాద్ మల్కాజ్‌గిరిలో దొంగలు రెచ్చిపోయారు. గౌతంనగర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఆలయం గోడకు కన్నం వేసిన దుండగులు.. లోపలికి ప్రవేశించారు. ఆ తర్వాత అమ్మవారికి చెందిన 20 తులాల బంగారం, 2 కేజీల వెండి వస్తువులు, ఆలయం కౌంటర్‌లో ఉన్న రూ. 80 వేల నగదు, హుండీలోని సొత్తును ఎత్తుకెళ్లారు. ఇవాళ ఉదయం పూజారి వచ్చి చూడగా..చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. దొంగతనానికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కాగా.. వాటిని కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు. నాలుగు రోజుల క్రితం చందానగర్‌లోనూ ఇటువంటి దొంగతనమే జరిగింది. గాంధీ విగ్రహం వెనుర ఉన్న రాజ్ లాల్ చంద్ పాన్ బ్రోకర్ జ్యువెలరీ షాపులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. జులై 31న అర్ధరాత్రి ఈ షాప్‌ను ఆనుకోని ఉన్న వస్త్ర దుకాణంలోకి చొరబడ్డ దొంగలు.. ఆ దుకాణం గోడకు కన్నం వేసి నగల దుకాణంలోకి ప్రవేశించారు. బంగారం షాపులోని సుమారు 40 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు..విచారణ చేపట్టారు. ఈ రెండు ఘటనల్లో దుండగులు గోడలకు కన్నం వేయంటంతో పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టారు. చోరీలకు పాల్పడింది ఒకే ముఠాకు సంబంధించిన దొంగలా ? లేక వేర్వేరు ముఠాలకు చెందిన వారా ? అనే కోణంలో విచారణ చేపట్టారు.

# విద్యార్థినులతో టీచర్ అసభ్య ప్రవర్తన

**రంగారెడ్డి జిల్లా, ఆగస్ట్5 (తెలుగుప్రభ)**

విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు దారి తప్పాడు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీనిపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. రాజేంద్రనగర్ పోలీసుల కథనం ప్రకారం.. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విష్ణు పీఈటీ టీచర్. బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడు. విష్ణు వేధింపులు తట్టుకోలేక విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. సమాధానం చెప్పాల్సిన స్కూల్ యాజమాన్యం పత్తా లేకుండా పోయింది.



## బంగారం.. వెండితో చీర

# నేతన్నలకు కేటీఆర్ ప్రశంసలు

**సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 5 (తెలుగుప్రభ)**

సిరిసిల్ల నేతన్నలపై మంత్రి కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. బంగారం, వెండి దారాలతో నేచిన చీర అద్భుతం అన్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన నల్లా విజయ్ మరోసారి తన ప్రతిభకు పదును పెట్టి 20 గ్రాముల బంగారం, 20 గ్రాముల వెండిని పూర్తి గా ఉపయోగించి పట్టు దారాలతో చీరను తయారు చేశారు. ఈ చీర వెడల్పు 48 ఇంచులు, పొడవు ఐదున్నర మీటర్లు, బరువు 500 గ్రాముల ఈ చీర ఖరీదు సుమారుగా 1,80,000 రూపాయలు ఖర్చు అయింది. దీనిని తయారు చేయడానికి నెల రోజుల సమయం పట్టింది. ఇంకా త్వరలో మరో చీర తయారు చేయనున్నారు దాదాపు 25 లక్షల రూపాయలు వెచ్చించి త్వరలో ఒక చీరను తయారు చేయనున్నారు. ఈ చీరలో దాదాపుగా అర కేజీ వెండి, పావు కేజీ కేజీ గోల్డ్ ద్వారా ఆ చీరను నేయనున్నారు. కొంత మంది వ్యాపారాస్తులు.. వీటిని కొనుగోలు చేయడానికి ముందుకోస్తున్నారు. గతం లో అగ్గి పెట్టేలో ఇమిడే చీర, శాల్వా, డబ్బనం, సూది రంధ్రం లో దూరే చీర, తిరుమల వేంకటేశ్వర స్వామి వారికి రెండు గ్రాముల బంగారంతో పట్టు వస్త్రం, విజయవాడ కనుక దుర్గమ్మ అమ్మ వారికి పట్టు చీర, 220 రకాల రంగుల చీర, తామర, అరటి నారాతో తయారు చేసారు చీర 20 గ్రాములతో వెండి చిర, 27 సుగంధ ద్రవ్యాల సువాసన వచ్చే విధంగా చిరను నేశాననీ అంటున్నారు విజయ్. ప్రభుత్వం సహకారం అందిస్తే మరిన్ని అద్భుతాలు చేస్తానని చెబుతున్నారు. విజయ్.. నైపుణ్యాన్ని మినిస్టర్ కేటీఆర్ ప్రశంసించారు.

# టీడీపీ, వైసీపీ డిష్యూం.. డిష్యూం..

**చిత్తూరు, ఆగస్ట్ 5 (తెలుగుప్రభ)**



ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీ వైసీపీ, ప్రతిపక్షం టీడీపీ మధ్య అగ్గి రగులుతోంది. ఇరు పార్టీల కార్యకర్తలూ ఘర్షణలకు దిగుతున్నారు. రెండు రోజులుగా రాజకీయ అల్లర్లు కొనసాగుతున్నాయి. పుంగనూరు లో నిన్న జరిగిన ఆందోళనల నేపథ్యంలో వైసీపీ ఇచ్చిన బంద్ కొనసాగుతోంది. ఈ సందర్భంగా చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధంతో మళ్లీ ఘర్షణ చెలరేగింది. చిత్తూరు జిల్లా పూతలపట్టులో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మరోసారి టీడీపీ, వైసీపీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. చంద్రబాబు దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి వైసీపీ నేతలు దగ్ధం చేయగా.. పోటీగా జగన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టారు టీడీపీ కార్యకర్తలు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. రెండు వర్గాలు ఘర్షణకు దిగడంతో పోలీసులు రెండు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు.

# బ్రిటీష్ పాలనను తలపిస్తోంది..

**హైదరాబాద్, ఆగస్ట్5 (తెలుగుప్రభ)**



దేశంలో గిరిజనులను రెండు వర్గాలుగా విభజించిన బ్రిటిష్ పాలకులు ప్రారంభించారని, దాన్ని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మండలి ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన ఆమె... గిరిజనుల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని కొనియాడారు. బీఆర్ఎస్ మాత్రం అందరినీ సమానంగా చూసే ఉద్దేశంతో ప్రవర్తిస్తోందని, తెలంగాణ ఆచరిస్తున్న పద్ధతినే దేశం అనుసరిస్తుందని చాలా పథకాల్లో కనిపించిందన్నారు. గిరిజనుల విషయంలో కూడా మన ఆచరిస్తున్న పద్ధతినే దేశం అనుసరిస్తుందని అన్నారామె... గిరిజనులకు కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, పోడు భూములు ఇచ్చామని ఇదంతా.. సీఎం కేసీఆర్ ముందుచూపు వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు ఎమ్మెల్సీ కవిత.

## బీజేపీ జనరల్ సెక్రటరీ రాజీనామా

# గుజరాత్‌లో పార్టీకి షాక్



**గుజరాత్, ఆగస్ట్5 (తెలుగుప్రభ)**

గుజరాత్‌లో బీజేపీ పార్టీకి చెందిన జనరల్ సెక్రటరీ ప్రదీప్ సింహ వాఘేలా రాజీనామా చేశారు. ఆ పోస్టుకు రాజీనామా ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. మరికొన్ని రోజుల్లో అన్నీ సర్దుకుంటాయన్నారు. అయితే వ్యక్తిగత కారణాల వల్ల ఆయన రాజీనామా చేసినట్లు ఆ రాష్ట్ర పార్టీ కార్యదర్శి రజినీభాయ్ పటేల్ తెలిపారు. ప్రస్తుతం పరిస్థితులు తనకు అనుకూలంగా లేవని, అందుకే పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నట్లు ఇటీవల వాఘేలా పేర్కొన్నారు. వాఘేలా స్వచ్ఛంధంగా రాజీనామా చేశారని, దాన్ని ఆమోదించినట్లు కూడా పటేల్ తెలిపారు. తొలుత వాఘేలాపై రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆంక్షలు విధించారు. ఆయన్ను బ్యాన్ చేశారు. ప్రస్తుతం వాఘేలా ట్విట్టర్ ప్రొఫైల్‌లో .. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అని మాత్రమే ఉంది. భారతీయ జనతా యువ మోర్చాకు చెందిన వాఘేలా.. 2016 నుంచి ఆ పార్టీ జనరల్ సెక్రటరీగా ఉన్నారు.